సాక్షి ఏలూరు

సోమవారం, 23, అక్టోబర్, 2023



ఆంధ్రా మైసూర్ ముస్తాబు

నూజివీడు దసరా ఉత్సవాల నిర్వహణలో రెండో మైసూర్‌గా పేర్గాంచింది. సోమవారం జరిగే వేడుకలకు సర్వం సిద్ధమైంది. II లో



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు కసరాజు రజనీకుమార్, అజయ్‌కుమార్ (గుంటూరు) కుటుంబం రూ.1,83,090ను ఆదివారం విరాళంగా అందజేశారు.

చినవెంకన్న సన్నిధిలో..



ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రాన్ని మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ఆదివారం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.

న్యూస్‌రీల్

175 సీట్లు సాధించాలని..

ఎంపీ కోటగిరి శ్రీధర్ పాదయాత్ర



పాదయాత్రగా వెళుతున్న ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే తలారి, వాసుబాబు

కామవరపుకోట/ద్వారకాతిరుమల : రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని, రాబోయే ఎన్నికల్లో 175 సీట్లు సాధించాలని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కాంక్షిస్తూ ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు పాదయాత్ర చేపట్టారు. ఆదివారం కామవరపుకోట నుంచి ద్వారకాతిరుమలకు పాదయాత్ర చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. ఉదయం కామవరపుకోటలో ప్రారంభమైన యాత్ర మధ్యాహ్నం చిన వెంకన్న సన్నిధికి చేరుకుంది. ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు (గోపాలపురం), పుప్పాల వాసుబాబు (ఉంగుటూరు), తెల్లం బాలరాజు (పోలవరం) ఎంపీ శ్రీధర్‌బాబుకు స్వాగతం పలికారు. నారాయణ అతిథి గృహానికి చేరుకున్న ఎంపీ శ్రీధర్ బాబుకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కుటుంబ వేడుకలా విజయదశమి

ఆంధ్రా సుగర్స్ చైర్మన్, ఎండీ నరేంద్రనాథ్ చౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి

తణుకు: ఆంధ్రా సుగర్స్ ఆధ్వర్యంలో ఏటా దసరా ఉత్సవాలను కుటుంబ వేడుకల్లా నిర్వహిస్తున్నామని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి అన్నారు. విజయదశమిని పురస్కరించుకుని ఆంధ్రా సుగర్స్ ఆధ్వర్యంలో స్థానిక సిల్వర్ జూబ్లీ పార్కులో జరిగిన వేడుకలకు ఆయన అధ్యక్షతన వహించి మాట్లాడారు. ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నట్టు చెప్పారు. సంస్థ అడిషనల్ సెక్రటరీ పీవీఎస్ విశ్వనాథకుమార్ మాట్లాడుతూ అంతరిక్షంలో ప్రయోగించే రాకెట్లకు ఉపయోగపడే ఇంధనం ఇక్కడి నుంచే సరఫరా చేయడం గర్వకారణం అన్నారు. చరిత్రాత్మక మిషన్ చంద్రయాన్–3, గగనయాన్ ప్రాజెక్టులో భాగస్వాములైనందుకు గర్విస్తున్నామన్నారు. సినీ నటుడు వెళ్లంకి నాగినీడు, వాస్తు, జ్యోతిష్య ప్రవీణ, అష్టావధాని డాక్టర్ ప్రభల సుబ్రహ్మణ్యశర్మ, సంస్థ జీఎం (హెచ్ఆర్) ఎ.సాంబశివరావు, వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) కె.వెంకటరత్నం పాల్గొన్నారు.

పండగ పూట మృత్యుఘోష

- గోదావరిలో గల్లంతైన నలుగురు యువకుల మృతదేహాలు లభ్యం
- పేరుపాలెం బీచ్‌లో ఇద్దరు మృతి.. మరొకరు గల్లంతు
- విషాదాన్ని నింపిన విహార యాత్రలు



తణుకులో రవితేజ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

తణుకు: విహారయాత్రకు వెళ్లి గోదావరిలో గల్లంతైన యువకుల మృతదేహాలు ఆదివారం స్వస్థలాలకు చేరుకున్నాయి. తణుకుకి చెందిన ఏడుగురు యువకులు విహారయాత్ర పేరుతో కాకినాడ జిల్లా యానాం వెళ్లి తిరుగు ప్రయాణంలో తాళ్లరేవు మండలం గోపులంక పుష్కర్ ఘాట్ వద్ద స్నానానికి దిగి గోదావరిలో గల్లంతైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో హనుమంతు సాయికార్తీక్ (20), ముద్దని ఫణీంద్రగణేష్ (20), పెండ్యాల బాలాజీ (21), తిరుమల రవితేజ (20) మృతదేహాలు వెలికితీసిన యంత్రాంగం కాకినాడలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఆదివారం సాయంత్రం రెండు వాహనాల్లో మృతదేహాలు తణుకు వచ్చాయి.

నాలుగు కుటుంబాల్లో తీరని శోకం

- చేతికి అందివచ్చిన కొడుకులు అచేతనంగా తిరిగిరావడం నాలుగు కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చింది. బాలాజీ తండ్రి చనిపోగా తల్లి వెంకటలక్ష్మి ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో ఆమె కన్నీటి పర్యంతమవుతున్నారు. బాలాజీ తాడేపల్లిగూడెంలోని బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు.
- రవితేజ తండ్రి చనిపోగా తల్లి శ్రీదేవి బ్యూటీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసిన రవితేజ పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసుకుంటూ తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. రవితేజ, బాలాజీ నివాసాలు ఒక్కచోటే ఉన్నాయి.
- డిప్లొమా పూర్తిచేసిన సాయికార్తీక్ ఇంటి వద్దనే ఉంటున్నాడు. తండ్రి పవన్ స్థానికంగా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు.
- ఫణీంద్ర గణేష్ తాడేపల్లిగూడెంలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. తండ్రి శ్రీనివాసరావు ఉద్యోగానికి గల్ఫ్ వెళ్లారు.

'అల'ముకున్న విషాదం

 

గొరసా సావిత్రి (ఫైల్) రఘువర్మ (ఫైల్)

తణుకు: తణుకు నుంచి విహార యాత్ర పేరుతో మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌కు వెళ్లిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గల్లంతు కాగా ఇద్దరు మృతిచెందారు. తణుకు చెందిన రెండు కుటుంబాల వారు ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో పేరుపాలెం బీచ్‌కి చేరుకున్నారు. ఉదయం 11 గంటల నుంచి వారు సముద్రంలో స్నానం చేస్తూ ఆనందంగా గడిపారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గొరసా సావిత్రి (35), ఆమె అన్న కొడుకు అనుపోజు రఘువర్మ (26), అతడి చిన్నాన్న కుమారుడు అనుపోజు రవి కుమార్ (17), సావిత్రి కుమార్తెలు శ్రావణి (16), తన్మయి (15) సముద్రంలో జలకాలాటల్లో ఉండగా.. ఒక పెద్ద అల రాగా వారు అదుపుతప్పి లోపలికి కొట్టుకుపోయారు. స్థానికులు, మత్స్యకారులు వారిని కాపాడే ప్రయత్నం చేశారు. ముందుగా శ్రావణి, తన్మయిలను బయటికి తీసుకొచ్చారు. రెండో ప్రయత్నంలో రఘువర్మ, సావిత్రిలను కూడా తీసుకొచ్చారు. అయితే సావిత్రి ఒడ్డుకు చేరేటప్పటికే ప్రాణాలు కోల్పోయింది. రఘువర్మను నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చేసరికి మృతి చెందాడు. రవి కుమార్ ఆచూకీ లభించలేదు.

చూసిన కనులదే భాగ్యం

రేపటి నుంచి చిన వెంకన్న బ్రహ్మోత్సవాలు



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి (చినవెంకన్న) ఆశ్వయుజ మాస బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 29 వరకు ఉత్సవాలను వైభవంగా నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏటా ఎనిమిది రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలను ఈసారి చంద్రగ్రహణం కారణంగా ఆరు రోజులకు కుదించారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామోత్సవాలు, వాహన సేవలు, రోజూ ప్రత్యేక అలంకరణలు ఉంటాయి. శ్రీహరి కళాతోరణ వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 24న శ్రీవారు, అమ్మవార్లను పెండ్లి ముస్తాబు, 25న రాత్రి ధ్వజారోహణం, 26న రాత్రి తిరుకల్యాణోత్సవం, 27న రథోత్సవం 28న శ్రీచక్రస్నానం, ధ్వజావరోహణం, 29న చూర్ణోత్సం, వసంతోత్సవం, శ్రీపుష్పయాగం-పవళింపుసేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

నిత్యార్జిత కల్యాణాలు, సేవలు రద్దు

ఉత్సవాల్లో భాగంగా ఈనెల 24 నుంచి 29 వరకు ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు రద్దు చేశామని దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



ఏలూరులో ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదల పక్షపాతిగా ఉన్నారనీ, వైఎస్సార్‌సీపీ పేదల పార్టీ అని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు 15వ డివిజన్‌కు చెందిన నిడిగట్టి మహేష్ ఆధ్వర్యంలో వంగాయగూడెం గాంధీ కాలనీకి చెందిన సుమారు 200 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే నాని పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు న్యాయం చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. చంద్రబాబు అవినీతితో జైలుకు వెళ్లారనీ, ఆయన హయాంలో చేసిన లక్షల కోట్ల అప్పులను ఏం చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఆత్మగౌరవాన్ని పెంచేలా..

- సామాజిక సాధికారత దిశగా అడుగులు
- ఏలూరులో బస్సు యాత్ర సన్నాహక సదస్సు



సన్నాహక సదస్సులో మాట్లాడుతున్న పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, వేదికపై మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యేలు కైలే, తలారి, ఎలీజా, జూపూడి తదితరులు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి విజయభేరి మోగించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావటం ఖాయమని, ప్రతిఒక్కరూ అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని పిలుపునిచ్చారు. ఏలూరు సారథి కల్యాణమండపంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే సామాజిక సాధికారత బస్సు యాత్ర సన్నాహక సదస్సు ఆదివారం నిర్వహించారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని మాట్లాడుతూ మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావిస్తూ హామీలన్నింటినీ సీఎం జగన్ అమలు చేసి చూపించారన్నారు. మరలా జగన్‌ను సీఎం చేసేందుకు ఎస్సీలంతా అండగా నిలవాలని కోరారు. చంద్రబాబు కుట్రలు, సానుభూతితో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారనీ, గతంలో ఎస్సీలకు అరకొర పథకాలు అమలుచేసి ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని విమర్శించారు. దళితులు ఆత్మగౌరవంతో బతికేలా రాజ్యాధికారంలో భాగస్వామ్యం, పదవులు, ప్రతి కుటుంబాన్ని అభివృద్ధి చేయాలనే ఆకాంక్షతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని గుర్తుచేశారు.

ఆత్మవిమర్శ చేసుకోవాలి

ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీలంతా ఆత్మవిమర్శ చేసుకోవాలనీ, చంద్రబాబు పాలన, సీఎం జగన్ పాలనలో సంక్షేమాన్ని బేరీజు వేసుకోవాలన్నారు. చంద్రబాబు రూ.2.67 లక్షల కోట్లు అప్పులు చేసి పేద, ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఒక్క పథకమైనా అమలు చేశారా అన్ని ప్రశ్నించారు. సీఎం జగన్ నేరుగా పథకాల లబ్ధిని ప్రజలకు అందిస్తున్నారని, చంద్రబాబు చేసిన అప్పులు ఏమయ్యాయో ప్రజలే తెల్సుకోవాలని చెప్పారు.

రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు

ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో సీఎం జగన్ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. అంబేడ్కర్ ఆలోచనా విధానంతో గ్రామ స్వరాజ్యానికి నాంది పలికారన్నారు. చంద్రబాబు హయాంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పి మోసం చేశాడని, సీఎం జగన్ చేసి చూపించారని తెలిపారు. సీఎం జగన్ పాలనలో పేదలు, దళితులందరికీ మేలు జరుగుతుందన్నారు. సదస్సులో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకరరావు, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు పండుల రవీంద్రబాబు, బొమ్మి ఇజ్రాయేల్, ఎమ్మెల్యేలు కొండేటి చిట్టిబాబు, రక్షణనిధి, వీఆర్ ఎలీజా, తలారి వెంకట్రావు, మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ ప్రసంగించారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తేరా ఆనంద్, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, నగర అధ్యక్షుడు పాలిమేర దాసు, కో-ఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్ సదస్సు నిర్వహణ పర్యవేక్షించగా పెరికే వరప్రసాద్, దయాల నవీన్ బాబు, సొంగ సందీప్, పాలిమేర హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ఆంధ్రా మైసూర్ ముస్తాబు

నూజివీడులో నేడు దసరా ఉత్సవాలు



కోట మహిషాసురమర్దని ఆలయం



ఐరావతం

నూజివీడు: పౌరుషాల పోతుగడ్డగా చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన నూజివీడు దసరా ఉత్సవాల నిర్వహణలో రెండో మైసూర్‌గా పేరుగాంచింది. ఈ నెల 23న జరిగే ఉత్సవాలను తిలకించడానికి ప్రజలు భారీగా తరలి వస్తారు. బుట్టబొమ్మలు, గరుడ వాహనం, ఐరావతం ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అలాగే కోలాట నృత్య ప్రదర్శనలు, చిత్ర, విచిత్ర వేషధారణలతో జోరుగా ఉత్సవాలు సాగనున్నాయి. స్థానిక ఉయ్యూరు ఎస్టేట్ వద్ద జమిందారీ వారసులు జమ్మికొట్టి ప్రారంభిస్తారు. అక్కడ నుంచి ప్రారంభమయ్యే ఊరేగింపు రాత్రంతా పురవీధుల్లో తిరుగుతూ ప్రజల్ని రంజింపచేస్తుంది. కోట మహిషాసురమర్దిని అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గరగర నృత్యం, బేతాళ సెట్టు, కర్రల మీద మనుషుల నడక, శక్తివేషాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ ధగధగలతో రాత్రంతా పురవీధులు విద్యుత్‌కాంతులు విరజిమ్ముతూ సాగే దసరా ఉత్సవాలను తిలకించడానికి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు ఇక్కడకు తరలి వస్తుంటారు. ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలో బొమ్మల దుకాణాలు వెలిశాయి. స్థానిక హనుమాన్‌జంక్షన్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ చిన్నారుల్ని విశేషంగా ఆకర్షిస్తోంది. దసరా ఉత్సవాల్లో భాగంగా ఈనెల 23నుంచి 25 వరకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షుడు రామిశెట్టి మురళీకృష్ణ, ఫెస్టివల్ కమిటీ సెక్రటరీ పగడాల సత్యన్నారాయణ ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.

రెండు శతాబ్దాల చరిత్ర

రెండు వందల సంవత్సరాల క్రితం ఉయ్యూరు రాజా నూజివీడులో దసరా ఉత్సవాలకు శ్రీకారం చుట్టినట్లు చరిత్ర చెబుతుంది. ఉయ్యూరు ఎస్టేట్ సంస్థానాధీశులైన రాజా రంగయ్యప్పారావువారి సంస్థాన ద్వారం గుర్రాల గేటు వద్ద ఉన్న ఆయుధాగారంలోని ఆయుధాలకు ఎస్టేట్‌లోని జమ్మి చెట్టు వద్ద పూజ చేసి దసరా ఉత్సవాన్ని ప్రారంభించే ఆనవాయితీ నేటి వరకూ వస్తోంది. ఉయ్యూరు రాజా హయాంలో పద్నాలుగు ఎస్టేట్‌లకు చెందిన ఏనుగులు అంబారీ, ఒంటెలు, గుర్రపు స్వారీలతో పెద్ద ఊరేగింపు జరిగేది. కోలాటాలు, కత్తి సాము, గారడీలు, మేజు వాణిలతో ఉత్సవాలు జరిగేవి. రాజా రంగయ్యప్పారావు తదనంతరం రాజా వెంకటాద్రి అప్పారావు మైసూర్ మహారాజా ఆధ్వర్యంలో జరిగే దసరా ఉత్సవాలను తిలకించారు. అక్కడి బుట్టబొమ్మలను చూసి మంత్రముగ్ధడయ్యారు. ఆ తరహాలోనే బుట్టబొమ్మలను ప్రత్యేకంగా తయారు చేయించి నూజివీడులో జరిగే ఉత్సవాల్లో ప్రదర్శింపజేయడం ఆనవాయితీగా మారింది.

భారీ పోలీస్ బందోబస్తు

ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తును ఏర్పాటుచేశారు. ఆలయంలో తోపులాటలు చోటుచేసుకోకుండా క్యూలైన్ల వద్ద ఎన్‌సీసీ క్యాడెట్లు, ట్రిపుల్ ఐటీకి చెందిన సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహించనున్నారు. చోరీలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి మంగళవారం ఉదయం 7 గంటల వరకూ లారీలు, భారీ వాహనాలను దారి మళ్లించారు.

రికార్డు స్థాయిలో సుజుకి అమ్మకాలు



ధర్మభేరి ప్రాంగణంలో ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేయడానికి వచ్చిన వినియోగదారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుజుకి ద్విచక్ర వాహనాలు రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగాయని నగరంలోని శ్రీకృష్ణ సుజుకీ మేనేజింగ్ డైరెక్టర్ నారా శేషు తెలిపారు. తమ సంస్థ ద్వారా సుజుకి కంపెనీకి చెందిన మోటార్ సైకిళ్ళు, స్కూటర్లు మునుపెన్నడూ లేని విధంగా దసరాను పురస్కరించుకుని ఆఫర్లతో విక్రయిస్తున్నామన్నారు. అతి తక్కువ డౌన్ పేమెంట్‌తో నూరు శాతం ఫైనాన్స్ సౌకర్యంతో, అతి తక్కువ వడ్డీకే వాహనాలు అందచేస్తున్నామని చెప్పారు.

కంటైనర్‌లో తరలిస్తున్న గో మాంసం పట్టివేత

నూజివీడు: కంటైనర్‌లో రవాణా చేస్తున్న 19 టన్నుల గో మాంసాన్ని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం తుక్కులూరు వద్ద ఈ ఘటన జరిగింది. తమకు అందిన సమాచారం మేరకు నూజివీడుకు చెందిన గోసంరక్షణ సమితి సభ్యులు తుక్కులూరు వద్ద కంటైనర్‌ను నిలిపి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్‌ఐ తలారి రామకృష్ణ వెంటనే ఘటనాస్థలికి చేరుకొని విచారణ చేయగా, ఒడిశా నుంచి కర్నాటకకు మాంసాన్ని రవాణా చేస్తున్నట్లు తేలింది. గో మాంసాన్ని శివారు ప్రాంతంలో గోతులు తీసి పాతిపెట్టారు. గోసంరక్షణ సమితి సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాల విక్రయాల్లో 'హీరో'



నగరంలో ఏర్పాటు చేసిన హీరో వాహనాల ఎగ్జిబిషన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ద్విచక్ర వాహనాల మార్కెట్‌లో హీరో వాహనాలు ఎదురులేని స్థానంలో నిలిచాయని సాయి స్వర్ణ హీరో షోరూం జనరల్ మేనేజర్ ఏవీ సోమేశ్వరరావు తెలిపారు. దసరా సందర్భంగా బైకులు, స్కూటర్ల కొనుగోలుకు వినియోగదారుల మొదటి ఎంపికగా హీరోనే ఎంచుకున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా తమ షోరూంలో అంచనాలకు మించి విక్రయాలు జరిగాయని స్పష్టం చేశారు. ప్రతి వాహనం కొనుగోలుపై రూ.5 వేలు తగ్గింపుతో ఆసక్తి చూపారని, రూ. 4999 డౌన్ పేమెంట్ చెల్లించిన వారికి వాహనాలు అందించే ఏర్పాటు చేశామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ ఇల్లు అమ్మబడును తిప్పాని వారి వీధి(కప్పల వెంకన్న) సెంటర్, Tanuku RCC గ్రౌండ్ & 1st ఫ్లోర్. 9063119119, 9705129119 [G-7769]

స్థలం అమ్మబడును

■ కృష్ణాజిల్లా, హంసలదీవి గ్రామంలో చేప లు, రొయ్యల చెరువులకు అనుకూలమైన 5 & 20 ఎకరాల మాగాణి భూమి అమ్మకమునకు కలదు. ✆ 99590 60109, 97013 66275 [B-1210037]

SERVICES

BUSINESS OFFER

■ ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 7015828102 [HA-788339]

చేపల చెరువు అమ్మకం

■ ప్రస్తుత ఏలూరు జిల్లా మండవల్లి మండలములో 3 ఎకరాల చేపల చెరువు అమ్మకానికి కలదు. సీరియస్ కొనుగోలుదార్లు వెంటనే సంప్రదించండి. ✆ 98854 52125 [B-788228]

WANTED

■ ద్వారకాతిరుమల మండలం CH: పోలేపల్లి గ్రామం శ్రీ సత్యసాయి మహాలక్ష్మి బాలికల వసతి గృహమునకు లేడి వార్డెన్స్ మరియు ఆయాలు కావలెను. భోజన వసతి మంచి జీతం. సంప్రదించండి: 91001 82363 [P-772922]

■ మా ఆఫీసు ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15 వేలు ఆపైన ఆదాయం పొందండి. సంప్ర: 9177736926 [G-490]

■ ప్రముఖ కంపెనీలో జిల్లా/మండలాల వారిగా పనిచేయుటకు కో ఆర్డినేటర్లు కావలెను. Sal: 20,000 ఆపైన, Send Resume వాట్సాప్. ✆ 7330552222. [T-1177903]

■ కస్టమైజ్డ్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ.15000-40000/-, ఫ్రీ రూమ్ + భోజనం. Hyd.ఫోన్: 7995365999 [HA-751]

■ ఏలూరు ఇంటిలో ఉండి వంటపని అన్ని పనులు చేసుకొని ఇంటి వద్ద ఉండుటకు ఏ బాదర బందీలేని స్త్రీ 25-45 సం॥ లోపు వారు కావలెను. వసతి భోజనం జీతం.15000రూ. సంప్ర: 6301172031, 99481 14595 [P-772804]

■ రామకృష్ణ గ్రూపు (AP NO-1) VJA, HYD. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను, భోజనం+వసతి+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52828, 92814 52833 [B-1068147]

■ APSRTC నందు కాంట్రాక్ట్ ఉద్యోగుల కొరకు నర్సాపురం, రాజోలు, రాజమండ్రిలో పనిచేయుటకు ఆయిల్ పంపుబాయ్స్, AC Bus అటెండర్స్ కావ లెను. ఆకర్షణీయమైన జీతం. PF & ESI కలదు. ✆ : 94937 85599, 79933 21799 [R-1884]

■ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. (పురుషులు) 2 సం॥ అనుభవం, ఆకర్షణీయమైన జీతం మరియు ఇన్సెంటివ్ ఇవ్వబడును. షోరూం మేనేజరు కావలెను.(పురుషులు) 2 సం॥ అనుభవం జీతం + ఇన్సెంటివ్ ఇవ్వబడును. కంప్యూటర్ ఆపరేటర్స్ (స్త్రీ/ పు) 1 సం॥ అనుభవం (MS Office, MS Excel) ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర: 9603137879, 9603194069 [P-779463]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.